# అర్హత

నరకేసరి ముప్పయి మూడేళ్ల సర్వీ పూర్తి చేసి ఇటీవలనే రిటైరయేడు. పింఛను ఏగ్రైరాలన్నీ అందుకుంటున్నాడు. తను అమలు చేయడానికి వీలుకాని కోరిక ఒకటి అతనిలో వుండిపోయింది. అదేమిటంటే రాజకీయాల్లో చురుకుగా పాల్గొనాలని. ప్రభుత్వోద్యోగిగా తనకు ఈ ముప్పయ్ మూడేళ్ల సర్వీసులోనూ సాధ్యపడలేదు. క్రమ శిక్షణాచర్యకు గురికావలసి వస్తుందని. ఇప్పుడు రిటైరయేడు గనుక మరి బాధలేదు. తన మనోభీష్టాన్ని అర్ధాంగికి చెప్పేడు. "వద్దు! ఆ పని చేయకండి. రాజకీయాల్లో చేరేవారికి కొన్ని ప్రత్యేక అర్హతలుండాలి. అవి మీకింకా అలవడలేదు" వారించింది శ్రీమతి.

"ఏమిటవి?" అడిగేడు కుతూహలంగా, "సమయం వచ్చినప్పుడు చెబుతాను ఇప్పుడు కాదు. ముందు మనం తీర్థయాత్రలకి వెళ్లాలనుకున్నాం. ఆ పని పూర్తి చేద్దాం" అంది శ్రీమతి. నరకేసరి స్టేషన్‌కి వెళ్లి వారణాసికి రెండు బెర్తులు రిజర్వు చేసుకొచ్చాడు. ఓం ప్రథమంగా 'వారాణసీ పురపతిం భజవిశ్వనాథం" అయేక, అక్కణ్ణుంచి గయ, ప్రయాగ, వెళదామని వాళ్ల ఉద్దేశ్యం. దంపతులిద్దరూ విష్ణుపాదోద్భవ అయిన దివిషద్ధునిలో స్నానంచేసి, విశ్వనాథుని దర్శించుకున్నారు.

కాశీకి వెళ్లినవారు తమకు అత్యంత ప్రీతిపాత్రమైన ఒక పండునిగాని, కూరనిగాని, విడిచిపెట్టాలని అంటారు. అంటే ఆ ఫలం కాని, కూరకాని జీవితాంతం తినకూడదని విశ్వేశ్వరుని సన్నిధానంలో ప్రతిజ్ఞ చేయాలన్నమాట. ఆ విధంగా మనలో జిహ్వాచాపల్యాన్ని అణచుకొని అదుపులో పెట్టుకోవాలని మన పూర్వీకులు ఈ నియమాన్ని నిర్దేశించారు. దివ్యజీవన సంఘ వ్యవస్థాపకులైన స్వామీ శివానందులు అన్నారు. "శరీరం చెప్పినట్టు మనం వింటే, అది రోగం - మనం చెప్పినట్టు శరీరం వింటే - అది యోగం".

మనం చెప్పినట్లు శరీరం వినాలంటే-జిహ్వని అదుపులో పెట్టుకోవాలి! అందుకే కాశీలో ఏదో ఒక అత్యంత ప్రీతిపాత్రమైన వస్తువుని విడిచిపెట్టాలి. యాత్రపూర్తయ్యాక ఇల్లు చేరుకున్నారు. నరకేసరి దంపతులు.

"ఏవండీ! మీరు కాశీలో ఏవిటి విడిపెట్టేరండీ"? అడిగింది శ్రీమతి

"నేనేమీ విడిచిపెట్టలేదు!" అన్నాడు నరకేసరి.

"అదేమిటండి ఈ దాష్టీకం? అంతదూరం వెళ్లి శివుని సన్నిధానంలో ఏమీ విడిచిపెట్టకుండా వచ్చేశారా?" చోద్యపడింది శ్రీమతి. "ఆ నేనేం విడిచి పెట్టాలి చెప్పు? సిగ్గూలజ్జాను! ఈ రెండూ విడిచిపెట్టేశాను!" అన్నాడు నరకేసరి వెటకారంగా.

"ఆ! ఇప్పుడు మీరు పనికొస్తారండి రాజకీయాలకి! అదే దానిక్కావల్సిన అర్హత!" అంది శ్రీమతి.

31-1-1992

"ఆంధ్రభూమి" దిన పత్రిక